## వ్యవసాయ అనుబంధ పనులను ప్రోత్సహించాలి

- ఉపాధి హామీ రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉష
- యరగండ్లపల్లి, కొండూరులో ఉపాధి హామీ పనుల తనిఖీ



యరగండ్లపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉష

మర్రిగూడ, మే 22 : ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానుబంధ పనులను ప్రోత్సహించాలని రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉష సూచించారు. మండలంలోని యరగండ్లపల్లి, కొండూరు గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపట్టిన నర్సరీ, డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం పనులను బుధవారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు.అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. మండలం,గ్రామం యూనిట్‌గా లక్ష్యాలను నిర్దేశించుకొని మొక్కలను నాటాలన్నారు. ఫిష్ ఫాండ్, ఫామ్‌ఫాండ్‌లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులను ప్రోత్సహించారు. తడి,పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని ఇందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.డంపింగ్ యార్డుల్లో తయారవుతున్న ఆర్గానిక్ ఎరువును వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కూలీలకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా కావాల్సిన కొలతను తెలపాలన్నారు.విధుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. సమావేశంలో జిల్లా ప్రత్యేకాధికారి హార్టికల్చర్ ఏడీ శరత్‌బాబు, క్లస్టర్ ఏపీడీ బాలకిషన్, ఎంపీడీఓ చినమునయ్య, ఏపీఓ వెంకటేశం, ఎంపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

## బాలనర్సింహుడి కల్యాణోత్సవాలు ప్రారంభం



బాలనర్సింహుడి ఊరేగింపు

చిట్యాల, మే 22 : చిట్యాల శివారులోని బాలనర్సింహ స్వామి ఆలయ కల్యాణోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆచార్యత్వంలో ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, మంటపారాధనతో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం పట్టణంలో శోభాయమానంగా లక్ష్మి ఆండాళ్ సమేత స్వామి వారి శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, బొర్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

దామరచర్ల, మే 22: లక్ష్మీనర్సింహస్వామి జయంతి సందర్భంగా మండలంలోని వాడపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారంకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, మంటపారాధన, కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ పొదిల శ్రీనివాస్ సభ్యులు సర్వయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

## నల్లబెల్లం పట్టివేత



ఆటోను పరిశీలిస్తున్న ఎస్ఐ రాంమ్మూర్తి

కొండమల్లేపల్లి, మే 22 : అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను మండల కేంద్రంలో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి పెద్ద అడిశర్లపల్లి మండలం వద్దిపట్లకు ఆటోలో తరలిస్తున్న 3.60 క్వింటాళ్ల నల్లబెల్లం, 80 కిలోల పటికను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపారు. తనిఖీల్లో ఐడీ పార్టీ హేమానాయక్, కానిస్టేబుల్ భాస్కర్ ల్గొన్నారు.

## ఈ-సెట్‌లో నందికొండ విద్యార్థుల ప్రతిభ



సాయిగణేశ్

నందికొండ, మే 22 : నందికొండ పైలాన్‌కాలనీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ- సెట్‌లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఐలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ ఈ బ్రాంచ్‌కు చెందిన కకునూరి సాయిగణేశ్ ఈ-సెట్‌లో 20వ బ్రాంచ్ ర్యాంక్, 849వ ఇంటిగ్రేటెడ్ ర్యాంక్‌ను సాధించారని, సివిల్ విభాగంలో గోగు హేమంత్ 142వ బ్రాంచ్ ర్యాంక్, 940వ ఇంటిగ్రేటెడ్ ర్యాంక్‌ను సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## దర్వేశిపురం ఆలయం వద్ద ముగిసిన వేలం

నల్లగొండ సిటీ, మే 22 : దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వహించిన వేలం పాడి బుధవారం పలువురు దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అలుగుబెల్లి నర్సింహరెడ్డి, ఈఓ జయరామయ్య తెలిపారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భ ంగా సంవత్సరకాలం వరకు సీల్డ్ కోటేషన్లు నిర్వహించి పలువురు నుంచి డీడీలను తీసుకున్నారు. తలనీలాలకు టెండరు తక్కువ కోడ్ చేయడంతో వాయిదా వేశారు. చలువ పందిర్లు(తడకలు) ఎలక్ట్రికల్ డెకరేషన్,అర్జితసేవా పుస్తకాల ప్రింటింగ్,రంగులు మైక్ డిజిటల్ సౌండ్‌లను టెండర్లు రాగా మల్టీకలర్ ఫ్లెక్సీ బ్యానర్స్, కిరాణ సామగ్రి, అమ్మవారి సామగ్రి, ఎలక్ట్రికల్ సామగ్రి నీటి సౌకర్యం సామన్లకు టెండర్లు రానందున వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి,ఆలయ ఉద్యోగులు లింగయ్య, చెన్నయ్య, ఉపేందర్‌రెడ్డి ,నాగరాజు, మాజీ చైర్మన్ యాదగిరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్ సకాలంలో అందించాలి

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



కట్టంగూర్ : కుట్టు మిషన్ సెంటర్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

కట్టంగూర్, మే 22 : కొలతల ప్రకారం స్కూల్ యూనిఫామ్స్‌లు కుట్టించి విద్యార్థులకు సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. కట్టంగూర్ మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు మిషన్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించి తయారీ విధాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఆర్‌డీఓ ఏపీడీ శైలజ, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఏపీఎంలు జీడికల్లు, కస్పరాజు సైదులు, ఏపీఓ కడెం రాంమోహన్, సీసీ వెంకన్న, మల్లేశ్వరీ, వీఓ అధ్యక్షురాలు మంజుల, పద్మ, యామిని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

**29 వరకు యూనిఫామ్ పూర్తి చేయాలి**

చిట్యాల : ఈ నెల 29 వరకు విద్యార్థుల యూనిఫామ్స్ పనిని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణ చందర్ ఆదేశించారు. చిట్యాల మున్సిపాలిటీలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద సమభావన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల యూనిఫామ్స్ కుట్టు కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాణాల ప్రకారం నాణ్యతను పాటిస్తూ యూనిఫామ్స్ తయారు చేయాలని అన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, మెప్మా పీడీ కరుణాకర్, మెప్మా టీఎంసీ సరిత పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లాలి : ఎంఈఓ



ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ నాగయ్య

కట్టంగూర్, మే 22 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లాలని ఎంఈఓ మేక నాగయ్య సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను అందజేసి మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్స్ అందించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మండల నోడల్ అధికారి అంబటి అంజయ్య, ప్రధానోపాధ్యాయులు ఆలకుంట్ల వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు రవి, రామలింగయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం : ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



రుద్రారం చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు.

మిర్యాలగూడ, మే 22: మండలంలోని రుద్రారం చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. చెరువు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని ఇటీవల చెరువు నీటి సంఘం సభ్యులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీఓ శ్రీనివాస్‌రావు బుధవారం చెరువును పరిశీలించారు. ఐబీ అధికారులు చెరువుకు డివిజన్ సర్వేయర్ బాలాజీతో కలిసి వెంటనే హద్దులు నిర్ణయించాలని సూచించారు. రైతులపై చర్యలు తీసుకోవాలని ఐబీ అధికారులను ఆదేశించారు. ఎవరైనా రైతులు చెరువు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తాసీల్దార్ హరిబాబు, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

## శిఖం ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి

నిడమనూరు, మే 22 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతూ ముప్పారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. చెరువులో నీరు లేనందున శిఖం యథేచ్ఛగా అన్యాక్రాంతమవుతుందని, చెరువులో హద్దుల పేరుతో కొందరు రాతి స్తంభాలు పాతినట్లు వివరించారు. ఆక్రమణల నియంత్రణకు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ముప్పారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కోట్ల సైదులు, మాజీ చైర్మన్లు మంగినపల్లి వెంకటయ్య, మర్రి లక్ష్మయ్య, మేకల లక్ష్మయ్య, మర్రి శ్రీను, బొజ్జనబోయిన యాదయ్య, మర్రి దుర్గయ్య, మేకల బ్రహ్మం తదితరులున్నారు.

## శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నింపుతాం: ఏఈ

శాలిగౌరారం, మే 22: శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నింపడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ రాములు తెలిపారు. ప్రాజెక్టులోకి నీరు వచ్చే సూరారం వద్ద నున్న రాచకాల్వ కట్టను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వానకాలం సాగు వరకు ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నింపి రైతుల భూములకు సాగు నీరందించేందుకు ప్రతి నిత్యం కాల్వ వెంట వెళ్లి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 15 అడుగుల నీరు వచ్చి చేరినట్లు తెలిపారు. వీరి వెంట రైతు సంఘం మండల ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి, సూరారం మాజీ సర్పంచ్ నర్సింహ, రైతులు ఉన్నారు.

## 24న మర్రిగూడ ఎంపీపీ ఎన్నిక

మర్రిగూడ,మే 22 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న ఎంపీపీ ఎన్నుకోనున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య తెలిపారు.బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి 30న ఎంపీపీ మెండు మోహన్ రెడ్డిపై అవిశ్వాసం నెగ్గడంతో వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేశ్ గౌడ్ ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారన్నారు.జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఎంపీపీ ఎన్నిక కోసం ఉత్తర్వులు అందడంతో శుక్రవారం ఎన్నికను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ వెల్లడించారు. ఎన్నికకు హాజరు కావాల్సిందిగా మండలంలోని 11మంది ఎంపీటీసీలకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

## పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ, మే 22: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.7,500 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సచివాలయంలో ఆర్థిక అధికారికి వినతిపత్రం అందజేశారు. సుమారు లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు రవి, కిరణ్ ఉన్నారు.

## గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ చోరీ

కొండమల్లేపల్లి, మే 22 : మండలంలోని పెండ్లిపాకల గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని ఎత్తుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి ధన్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం పంచాయతీ ఎదుట ఉంచిన ట్రాలీని దొంగలించినట్లు వివరించారు. ట్రాలీ విలువ 1,84,000 ఉంటుందని, దీనిపై కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే ట్రాలీ వివరాల గురించి ఎంపీడీఓకు తెలియజేసినట్లు వివరించారు.

## లింగమంతుల స్వామి ఆలయ హుండీ లెక్కింపు

నకిరేకల్, మే 22 : మండలంలోని నెల్లిబండ గుట్టపై లింగమంతుల స్వామి, సౌడమ్మ ఆలయ హుండీని బుధవారం దేవాదాయ,ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించారు. జాతర సందర్భంగా రూ. 2,01,578 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బాతుక లింగస్వామి, ఆడెపు సతీశ్, బోయిళ్ల అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

## కెమెరా చోరీ

మిర్యాలగూడ, మే 22 : రెడ్డికాలనీలో గల ఫొటో స్టూడియోలో కెమెరా చోరీకి గురైంది. బాధితుడు పొడిచెట్టి వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం రెడ్డికాలనీలో తన శ్రీ వెంకటేశ్వర డిజిటల్ ఫొటో స్టూడియోలో తాను లేని సమయంలో వ్యక్తి వినియోగదారుడిగా వచ్చి కౌంటర్‌లో ఉన్న నికాన్ 300 మోడల్ కెమెరాను ఎత్తుకెళ్లినట్లు చెప్పాడు. దొంగలించిన వ్యక్తి కోసం చుట్టుపక్కలా వెతికినా అతని జాడ దొరకలేదన్నారు. దాంతో వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రమణామూర్తి

నీలగిరి, మే 22. నల్లగొండ జనరల్ అసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రమణామూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానంద్ వ్యక్తిగత కారణాల వల్ల సెలవుల్లో వెళ్లారు. ఆయన స్థానంలో జనరల్ ఫిజిషయన్‌గా హెచ్ఓడీ పనిచేస్తున్న డా.రమణామూర్తికి డీఎంఈ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు..

## రేపు విత్తన మేళా

నకిరేకల్, మే 22 : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం వారి ఆధ్వర్యంలో 24న శుక్రవారం మండలంలోని పాలెం గ్రామంలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు సహ పరిశోధన సంచాలకుడు మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంచడంతో పాటు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు శుక్రవారం ఉదయం 10 గంటలకు గ్రామానికి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విత్తనాల కోసం ఫోన్ : 9490409163, 63008 20238 లను సంప్రదించాలని సూచించారు.

## ఆర్థిక సాయం

చిట్యాల, మే 22 : వెలిమినేడుకు చెందిన బుట్టి సత్తెమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు అంతటి పారిజాతానర్సింహ బుధవారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్మినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, సుర్కంటి సత్తిరెడ్డి, చిర్రగోని శ్రీశైలం, మాజీ సర్పంచు దేశబోయిన మల్లమ్మ, అంతటి శోభరాజు, గోలి గణేశ్, కాటం సత్తయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడటౌన్, మే 22 : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 1 నుంచి 12 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు 995922 6308 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తెలిపాలని కోరారు.

## మాదాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

పెద్దఅడిశర్లపల్లి, మే 22: మండలంలోని వద్దిపట్ల గ్రామ మాదాంజనేయ స్వామి ఆలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యోలగపూరి కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా గుండెబోయిన నగేశ్, ప్రధాన కార్యదర్శి జేజాల సత్యనారాయణ, కోశాధికారి పుట్టపాక చెన్నయ్య, సహాయకార్యదర్శి కుంటిగోర్ల శివ, ప్రచార కార్యదర్శి మల్లి కంటి వెంకటేశ్వర్లు, భజన మండలి కమిటీని ఎన్నుకున్నారు.

## అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

శాలిగౌరారం, మే 22 : నేలను సారవంతం చేసే పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏఓ సౌమ్యశృతి బుధవారం తెలిపారు. సబ్సిడీ పోను జీలుగ రూ.1,116, జనుము రూ. 1,448లకు అందజేయనున్నట్లు వివరించారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు

- మునుగోడు : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సబ్సిడీ పై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులకు 100 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

- కేతేపల్లి :మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రంలో సబ్సిడీపై జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ బి.పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోను రూ.1,448 ధరకు 40 కిలోల సంచి లభిస్తుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని ఆయన కోరారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

- ఆ పార్టీ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ



కార్యకర్త కుటుంబానికి పార్టీ బీమా చెక్కు అందచేస్తున్న నల్లమోతు సిద్ధార్థ.

మిర్యాలగూడ, మే 22: కార్యకర్తల కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గద్ద వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. సంబంధిత చెక్కును మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితోకలిసి బుధవారం ఆయన కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పునాటి లక్ష్మీనారాయణ, రఘుమారెడ్డి, ఎండి. షోయబ్, షేక్ నాగుల్‌బాబా, చోటు, గుండెబోయిన చందుయాదవ్, దొనేటి సైదులు, నల్లగంతుల నాగభూషణం ఉన్నారు.

అలాగే పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు పల్నాటి జానకీరెడ్డి బుధవారం బైక్ ప్రమాదానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నల్లమోతు సిద్ధార్థ బుధవారం ఆసుపత్రికి వెళ్లి జానకిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మన్నెం శ్రీనివాస్ రెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు నందకిశోర్ యాదవ్, రెడబోతు సంతోష్‌రెడ్డి, జన్నపాల కిరణ్ పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలి

- మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్



మాట్లాడుతున్న కమిషనర్ ముసాబ్ అహ్మద్

నీలగిరి, మే 22 : నల్లగొండ పట్టణంలో శిథిలావస్థలోన్న భవనాలను గుర్తించి వాటికి మరమ్మతు చేయించుకోనేలా యాజమాన్యాలకు సూచించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ సూచించారు. నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం టౌన్ ప్లానింగ్, వార్డ్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య నిర్వాహణ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత ఇంట్లోలో ఎలాంటి ప్రమాదం లేదని తెలిస్తే చిన్న, చిన్న రిపేర్లు ఉంటే అయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్నా కూలిపోయేందుకు సిద్ధంగాన్న భవనాలను తొలగించాలని సూచించారు. సమావేశంలో ఏసీబీ నాగిరెడ్డి, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న తాసీల్దార్ తిరుపతయ్య

డిండి, మే 22: మండలంలోని వివిధ గ్రామాలకు 65 మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను కార్యాలయంలో తాసీల్దార్ తిరుపతయ్య బుధవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.1,00,116ల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫా పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, మే 22 : 11 కేవీ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించేందుకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శాంతినగర్, ముషంపల్లి రోడ్డు, అశోక్‌గార్డెన్, మారుతినగర్ ప్రాంతాల్లో నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

**మిర్యాలగూడలో..**

మిర్యాలగూడ : పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కే వీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కోడిరెక్క రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ పట్టణం, మండలంలోని కొత్తగూడెం, నందిపాడు, బి. అన్నారం, వెంకటాద్రిపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**త్రిపురారంలో..**

త్రిపురారం : మిర్యాలగూడలోని 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నందున నేడు ఉదయం 7 నుంచి 9గంటల వరకు 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే అన్ని 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిపురారం, నీలాయిగూడెం, మాటూరు, పీడీపల్లి ఫీడర్ల కింద ఉన్న అన్ని గ్రామాలకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం



నల్లగొండలో జీవ వైవిధ్యంపై అవగాహన కల్పిస్తున్న సురేశ్ గుప్తా

రామగిరి, మే 22: ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం నల్లగొండలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవవైవిధ్య ఆవశ్యకతపై విద్యార్థులు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పర్యావరణ వేత్త మిట్టపల్లి సురేశ్‌గుప్తా విద్యార్థులు జీవ వైవిధ్యంపై , వర్మీ కంపోస్టు నిర్వహణ, పర్యావరణం మేలు చేసే అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు .కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహరెడ్డి, ప్రముఖులు నన్నూరి రాంరెడ్డి, ఎదుళ్ల అంజిరెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

**చందంపేటలో..**

చందంపేట :అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఏడాది 'బి పార్ట్ ఆఫ్ ద ప్లాన్' ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓలు బి.సాయి ప్రకాశ్, ఎన్.భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వృక్షాలు నాటారు. అనంతరం ఎఫ్ఆర్ఓలు మాట్లాడుతూ చెట్లను నరకడం మానవ మనుగడపై ప్రభావం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి, అటవీ శాఖ సిబ్బంది, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



చందంపేట :మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

## బొడ్రాయి వేడుకలో ఎమ్మెల్యే బాలూనాయక్ పూజలు

చందంపేట(దేవరకొండ), మే 22 : దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు అభిషేకాలు నిర్వహించి గ్రామస్తులు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జాన్‌యాదవ్, దేవరకొండ ము న్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీటీసీ బిక్కునాయక్, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, మాజీ చైర్మన్ దేవేందర్‌నాయక్, నాయకులు సిరందాసు కృష్ణయ్య, జూలూరి ధనలక్ష్మీ బాల్‌నారాయణ, పాపానాయక్, లక్పతినాయక్, సిరాజ్‌ఖాన్, కొర్రరాంసింగ్‌నాయక్, కిన్నెర హరికృష్ణ, రమేశ్‌నాయక్, బాబురాం, అశోక్, గిరి పాల్గొన్నారు.

## నేడు వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం

హాలియా, మే 22 : హాలియాలోని వేంకటేశ్వరరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గోవర్ధన రాఘవాచార్యులు బుధవారం తెలిపారు. స్వామివారి కల్యాణం అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి సౌజన్యంతో అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**WANTED**

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

**PASSPORT LOST**

★ YATHANAPURI MURALI, S/o. Krishnaiah, R/o. 2-6/1, Urumadla (Vill), Chityal (Mandal), Nalgonda (Dist.) while I travelling from Urumadla to Chityala I Lost My Original Passport (No. L4712754). If found, please Contact: 9177899945.
NT+TT-NLG

**CHANGE OF NAME & DATE OF BIRTH**

I, JYOTHI, Spouse of 2591482A Naik (TS) Repaka Sreedhar Reddy, Resident of H.No. 7-4-5, Near Venkateswara Temple, Panagal, Nalgonda Town and District, Telangana State-508 001, have Changed My Name and Date of Birth from JYOTHI, on 8-7-1979 to REPAKA JYOTHI and Date of Birth on 25-7-1980 for future reference.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |